ఆంధ్రజ్యోతి
**
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
ఆదివారం 10 మార్చి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.134	194	221
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.136	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 , కనిష్ఠం 23.4

రహదారులకు మహర్దశ



- ప్రతిష్ఠాత్మక రీజనల్ రింగ్‌రోడ్డుకు తొలగిన అడ్డంకులు
- నల్లగొండ నుంచి కర్నూల్‌కు అనుసంధానమయ్యే మరో జాతీయరహదారి
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కీలక రహదారులకు వరుస శంకుస్థాపనలు
- రూ.700కోట్లతో నల్లగొండబైపాస్‌రోడ్డుకు ప్రతిపాదనలు

నల్లగొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి జిల్లా రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఓ వైపు రాజధానికి అనుసంధానించే రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త కార్యాచరణచేపట్టగా, మరోవైపు ఉమ్మడిజిల్లాలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తూ జాతీయ రహదారుల నిర్మాణానికి భారీ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రిగా ఉమ్మడి జిల్లాకు చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ఉమ్మడి జిల్లాలో రోడ్లు, విస్తరణ, కొత్త లేన్ల నిర్మాణాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా పనులకు వరుసగా శంకుస్థాపనలు చేస్తుండటంతో రానున్న రోజుల్లో ఉమ్మడి జిల్లాలో రోడ్ల అనుసంధానం మెరుగుకానుంది. కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇటీవల సమావేశమై జిల్లాలో ప్రాధాన్యమున్న రహదారులను ప్రతిపాదించారు.ఈ నెల రోజుల్లో కీలక రోడ్ల ప్రాజెక్టులకు మంత్రి శంకుస్థాపనలు చేయగా,మరికొన్ని కీలక ప్రాజెక్టులకు కేంద్రానికి నివేదించారు. ఇంకోవైపు జిల్లాలో అంతర్గత రోడ్ల మరమ్మతులు, కొత్త బీటీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి త్వరలో పూర్తిస్థాయిలో అన్నిపనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దీంతో అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ సహా పలు కీలక ప్రాజెక్టులకు వినతి

ఇటీవల కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమావేశమైన సమయంలో కీలకమైన రీజనల్ రింగురోడ్డు చేపట్టేందుకు ఆటంకాలను తొలగించే అంశంపై చర్చించారు. ఉత్తర, దక్షిణ ప్రాజెక్టులను వీలైనంత వేగంగా చేపట్టేందుకు కావాల్సిన అనుమతులను కేంద్రం మంజూరుచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సదుపాయాల కల్పనకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం పేర్కొనడంతో ఈ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్టయింది. కీలకమైన ఈ ఆర్‌ఆర్‌ఆర్ పూర్తయితే యాదాద్రి భువనగిరి జిల్లాకు రాజధానికి అనుసంధానం పెరగడంతో పాటు ఈ ప్రాంతం పారిశ్రామికంగా, సేవారంగాలపరంగా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. దీంతో పాటు ఏపీ నుంచి ఉమ్మడి పాలమూరు జిల్లా మీదుగా నల్లగొండకు అనుసంధానమయ్యేలా ఒక జాతీయ రహదారిని చేపట్టాలని కేంద్రమంత్రికి ప్రతిపాదనలు సమర్పించారు. ఏపీ రాష్ట్రం కర్నూల్ శివారులోని జోగులాంబ గద్వాల జిల్లా పుల్లూరు నుంచి (44వ నెంబర్ జాతీయరహదారి) అలంపూర్- జటప్రోల్- పెంట్లవెల్లి- కొల్లాపూర్- లింగాల- అచ్చంపేట- డిండి- దేవరకొండ- మల్లేపల్లి- నల్లగొండ వరకు 225 కిలోమీటర్ల నూతన జాతీయరహదారి నిర్మాణానికి ప్రతిపాదించారు. వీటితో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న నల్లగొండ బైపాస్ రోడ్డుకు రూ.700కోట్ల నిధులతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఈ పనులన్నింటికీ వచ్చే నెలలో టెండర్లు ఆహ్వానించాలని భావిస్తున్నారు.

పలు రహదారులకు శంకుస్థాపనలు

ఉమ్మడి జిల్లాలోని పలు కీలక రహదారుల విస్తరణ, బీటీ నిర్మాణాలకు ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. నకిరేకల్-వాడపల్లి, పానగల్-నకిరేకల్, నల్లగొండ-దేవరకొండ రోడ్లను నాలుగు లేన్లుగా మార్చేందుకు శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా నల్లగొండ-ముశంపల్లి రహదారిని డబుల్‌లైన్‌గా విస్తరించనున్నారు. నల్లగొండ-నర్సింగ్‌భట్ల-కురంపల్లి రోడ్డు, మామిడాల-చిరుమర్తి-మాడుగులపల్లి రోడ్లను డబుల్ రోడ్డుగా, ఇండ్లూరు-చందనంపల్లి రోడ్డుకు, లచ్చుగూడెం-పాల్వాయి రోడ్లకు ఇటీవల మంత్రి శంకుస్థాపనలు చేశారు. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు, బీటీ రెన్యువల్స్ కోసం, డబుల్ రోడ్ల నిర్మాణాల కోసం ఎమ్మెల్యేల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేయిస్తుండడంతో ఈ పనులన్నీ పూర్తయితే ఉమ్మడి జిల్లాలో రహదారుల పరిస్థితి మెరుగుకానుంది.

నా మనసంతా నల్లగొండ చుట్టూనే



నేనెక్కడున్నా నా మనసంతా నల్లగొండ చుట్టూనే ఉంటుంది. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో జిల్లా అన్ని రంగాల్లో వెనకబడింది. మా హయాంలో జిల్లాను అన్ని రంగాల్లో ముందుకుతీసుకెళ్లే పనులు చేపడుతున్నాం. రోడ్ల విషయంలో గత ప్రభుత్వం జిల్లాపై వివక్ష చూపింది. దాన్ని సరిచేసేలా అన్ని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు,విస్తరణ చేపడుతున్నాం.నల్లగొండ బైపాస్‌రోడ్డుకు రూ.700కోట్లతో త్వరలో శంకుస్థాపన చేస్తాం. ఉమ్మడి జిల్లాలో అద్భుతమైన రోడ్ నెట్‌వర్క్ ఉండేలా కృషిచేస్తున్నాం.
- కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి

నేడు దేవరకొండ నియోజకవర్గంలో రోడ్లకు శంకుస్థాపన

దేవరకొండ, మార్చి 9: దేవరకొండ నియోజకవర్గంలో ఈనెల 10న పలు రోడ్లకు రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్టు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతపల్లి మండల కేంద్రంలో ఉదయం 10.30గంటలకు రూ.4కోట్లతో చేపట్టనున్న సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన, 11.30 గంటలకు సాయిబాబా దేవాలయంలో పూజ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు రూ.14కోట్లతో చేపట్టనున్న దేవరకొండ పట్టణంలోని డిండి ఎక్స్‌రోడ్డు-మైనంపల్లి బిడ్జివరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

శంభులింగేశ్వర్వుడి కల్యాణం



శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా మేళ్లచెర్వులో శనివారం రాత్రి స్వయంభు శంభులింగేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

•7లో..

ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం పీఆర్సీ

రీజియన్‌లో 2,479మందికి లబ్ధి

నల్లగొండ, మార్చి 9: రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. పీఆర్సీతో కూడిన వేతనాలు జూన్ 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి.ఆర్టీసీ సిబ్బంది సంక్షేమం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రీజియన్ పరిధిలో మొత్తం 2,479మంది ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి దీంతో లబ్ధి చేకూరనుంది. ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లు, అధికారులు, ఏఈలు, అసిస్టెంట్ మేనేజర్లు, డిపో మేనేజర్లు, క్లర్క్‌లు, పెయింటర్లు, ఆర్టీసీ కానిస్టేబుళ్లు, ఎలక్ట్రీషియన్లు వీరందరికీ ప్రయోజనం చేకూరనుంది. నల్లగొండ రీజియన్ పరిధిలో మొత్తం ఏడు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. నల్లగొండ డిపో పరిధిలో 497మంది ఉద్యోగులు, దేవరకొండ డిపో పరిధిలో 428మంది, కోదాడ డిపో పరిధిలో 276మంది, యాదగిరిగుట్ట పరిధిలో 429మంది ఉద్యోగులు ఉన్నారు. అదేవిధంగా సూర్యాపేట డిపో పరిధిలో 398మంది, మిర్యాలగూడ డిపో పరిధిలో 379మంది, నార్కట్‌పల్లి డిపో పరిధిలో 72మంది ఉద్యోగులు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. టీఎస్ ఆర్టీసీలో పేస్కేల్ ప్రతీ నాలుగేళ్లకోసారి సవరిస్తారు. ప్రస్తుతం 2017పేస్కేల్‌తో పాటు 2021 పేస్కేల్ సవరించాల్సి ఉంది. ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం 2017 పేస్కేల్‌ను సవరించి 21శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేసేందుకు నిర్ణయించింది. ప్రస్తుతం సర్వీసులో ఉన్న ఉద్యోగులతో పాటు 2017 ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగులకు కూడా ఈ ఆర్థిక ప్రయోజనం పొందనున్నారు.



మిర్యాగూడలో ఆగనున్న వందేభారత్ రైలు

- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రైల్వే శాఖ
- ట్విట్టర్‌లో పేర్కొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మిర్యాలగూడ టౌన్, మార్చి 9: సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్ రైలు ఇకపై మిర్యాలగూడలో ఆగనుంది. కేంద్ర పర్యాటక శాఖమంత్రి కిషన్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా వెల్లడించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్(సికింద్రాబాద్), గుంటూరు రైల్వే డివిజన్ల పరిధిలో నడిచే పలు రైళ్లకు రాష్ట్రంలోని 14 స్టేషన్లలో రైల్వేశాఖ స్టాపులు ఇచ్చినట్లు ట్వీట్ చేశారు. ఆయా రైళ్లలో వందేభారత్ (ట్రైన్ నెం. 20701/20702) రైలుకు మిర్యాలగూడ స్టేషన్‌లో స్టాప్‌ఇచ్చినట్లు పేర్కొన్నారు.

అదేవిధంగారేపల్లే- సికిందాబ్రాద్ ఎక్స్‌ప్రెస్(ట్రైన్ నెం.1764 6)రైలుకు రామన్నపేటలో స్టాప్ ఇచ్చినట్లు ట్విట్టర్ వేదికగా కేంద్రమంత్రి వెల్లడించడంతో రైల్వే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్లను ఆధునికీకరణకు శ్రీకారం చుట్టిన రైల్వేశాఖ ట్రైన్ టికెట్ల ధరలు తగ్గించడంతోపాటు పలు స్టేషన్లలో అదనంగా స్టాపులు ఇవ్వడంపై నెటిజన్లు హర్షం వ్యక్తంచేస్తున్నారు. అయితే ఈ విషయమై అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని స్థానిక రైల్వే అధికారులు తెలిపారు.

11న ఫణిగిరికి మంత్రి జూపల్లి

నాగారం, మార్చి 9: నాగారం మండలంలోని ప్రసిద్ధ ఫణిగిరి బౌద్ధ క్షేత్రాన్ని ఈ నెల 11న పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించనున్నారని బోధిసత్వ ఫౌండేషన్ చైర్మన్ పులిగిల్ల వీరమల్లు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జూపల్లి కృష్ణారావుతోపాటు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ రానున్నట్లు వివరించారు. ఫణిగిరిలో ఏర్పాటుచేసిన మ్యూజియం, ఫణిగిరి గుట్టపై గతంలో తవ్వకాల్లో లభించిన బౌద్ధ ప్రతిమలు, శిలా శాసననాలు, చైత్యాలు, మహాస్థూపాలను పరిశీలిస్తారని తెలిపారు. మరోసారి ఫణిగిరి గుట్టపై తవ్వకాలకు భారత పురవస్తు శాఖ అనుమతించినందున మంత్రి జూపల్లి సోమవారం పనులను ప్రారంభించనున్నట్లు వివరించారు.

బీసీలకు చట్టసభల్లో ప్రాతినిధ్య వాటా కల్పించాలి

ఆల్ ఇండియా ఓబీసీ జాక్



అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న పాదయాత్ర బృందం

భువనగిరి టౌన్, మార్చి 9: జనాభా ప్రాతిపదికను చట్టసభల్లో బీసీలకు ప్రాతినిధ్య వాటా కల్పించాలని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ రాష్ట్ర నేత సాయిని నరేందర్ అన్నారు. పలు డిమాండ్ల సాధనకు చేపట్టిన పాదయాత్ర 9వ రోజు భువనగిరి చేరిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టసభల్లో సమాన ప్రాతినిధ్యంతోనే ఆయా వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ముందుగా అమరవీరుల స్మారక స్థూపం, తెలంగాణ కళాకారిని బెల్లి లలిత సమాధి వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మేకపోతుల నరేందర్, బత్తుల సిద్దేశ్వర్, ఎర్ర శ్రీహరి, కొంగ నరహరి, భువనగిరి శ్రీనివాస్, పటేల్ వనజ, పటేల్ వనిత, భిక్షపతి, సింగారపు అరుణ, విమల, విశ్వపతి, చిన్న శ్రావణ్‌కుమార్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల బ్యాక్ వాటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి
- ఆరునెలల్లో మోడల్ కాలనీ పూర్తిచేయాలి
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్‌లోని ఆదర్శ మోడల్‌కాలనీ పనులు పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, మార్చి 9: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు పులిచింతల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధిహామీ పనులు,నీటి ఎద్దడిపై సమీక్షా సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో తాగునీటి అవసరాలకు కృష్ణానది నుంచి వేసిన పైపులైన్ పనులు పరిశీలించి అన్ని గ్రామాలకు తాగునీరు అందించాలన్నారు. అధికారులు చిత్తశుద్ధితో నీతి, నిజాయితీగా పనిచేయాలని, ప్రజలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వమని, ప్రజాపాలన చేస్తుందన్నారు. హుజూర్‌నగర్ నుంచి మట్టపల్లి వరకు 25 కిలోమీటర్ల దూరం రూ.5.20కోట్లతో ఫోర్‌వే నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. హుజూర్‌నగర్ రింగ్ రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.కోటిన్నర నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో కోర్టు భవనాల సముదాయానికి 5 ఎకరాల సమయాన్ని కేటాయిస్తున్నట్లు వివరించారు. కృష్ణానదిలో పులిచింతల బ్యాక్ వాటర్‌లో గతంలో పైపులైన్ ద్వారా సాగునీరు సరఫరా చేశామని, మళ్లీ వాటిని పునః పరిశీలించాలని ఆదేశించారు. వేసవికాలంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులు అప్రమత్తంగా ఉండి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధిరారులపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఉండవన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రెండున్నర కోట్లతో సీటీ స్కాన్ మంజూరు చేయించినట్లు తెలిపారు. మరో 5 కోట్లతో భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తానన్నారు.

సమాజాన్ని ప్రభావితం చేసేది న్యాయవాదులే..

సమాజాన్ని ప్రభావితం చేసేది న్యాయవాదులేనని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మంత్రికి ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మేళ్లచెరువు జాతరకు రూ.కోటి, ముస్లిం షాదీఖానాకు రూ.50లక్షలు, రామాపురం షాదీఖాన్‌కు రూ.70లక్షలు, కోదాడ ఈద్గాకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమలో కలెక్టర్ వెంకట్రావ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ నాగార్జున్‌రెడ్డి, ఎంపీడీవో లావణ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట

కోదాడ: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కోదాడకు వచ్చిన ఆయన రూ.5కోట్లతో పునఃప్రతిష్ఠ చేస్తున్న కోదండ రామచంద్రస్వామి దేవాలయాన్ని సందర్శించారు. అనంతరం రూ.2 కోట్లతో నిర్మించనున్న ఈద్గాను, రూ.3కోట్లతో నిర్మించనున్న షాదీఖానా స్థలాలను పరిశీలించి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ స్థానాలను గెలుస్తుందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, ముస్లిం మత పెద్దలు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ఉచిత సలహాలు అవసరం లేదు

సూర్యాపేటరూరల్: కాళేశ్వరం విషయంలో బీఆర్‌ఎస్ నేతల ఉచిత సలహాలు అవసరం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సువెన్ ఫార్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భరోసా సెంటర్, షీటీం కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాళేశ్వరంపై జరిగిన నష్టంపై రాజ్యాంగ సంస్థ అయిన నేషనల్ డ్యామ్ అథారిటీ విచారణ చేస్తోందన్నారు. విచారణకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రాహుల్ హెగ్డే, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, జనార్దన్‌రెడ్డి, వెంకటరమణ, డీఎస్పీ రవికుమార్ పాల్గొన్నారు.

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం

సూర్యాపేట సిటీ: వైద్యరంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జనరల్ ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పేదల సంక్షేమ, ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విద్యా, వైద్య రంగాల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత లేకుండా చూడటంతోపాటు వైద్యంకోసం వచ్చే ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో మాట్లాడారు. ఆయనవెంట రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ మురళీధర్ రెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శారద, డీఎంహెచ్‌వో పి.కోటాచలం, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ వివరాలను తెలుసుకుంటున్న మంత్రి ఉత్తమ్

వచ్చే ఎన్నికల్లో జాగ్రత్తగా ఓటు వేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

తుంగతుర్తి, మార్చి 9: వచ్చే ఎన్నికల్లో ప్రజలు జాగ్రత్తగా ఓటు వేయాలని, మోదీ చాలా ప్రమాదకరమని సీపీఎం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని పార్టీ నియోజకవర్గస్థాయి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 రోజుల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగబోతున్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఓటు వేయాలన్నారు. దేశ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన పదేళ్ల పాలనలో అనేక విధానాలు దేశాన్ని నష్టపరిచే విధంగా ఉన్నాయన్నారు. అధికారంలోకి రాకముందు ప్రజల అవసరాలకనుగుణంగా పరిపాలిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నారని చెప్పారు. రైతు వ్యతిరేక చట్టాలపై ఉద్యమంలో 1300 రైతులు చనిపోయారన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య ఉన్నా, ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడం వల్ల అనేకమంది యువకులు రోడ్డున పడ్డారని చెప్పారు. దేశంలో జీఎస్టీ విధానాన్ని తీసుకువచ్చి కోట్ల రూపాయలు పన్నుల రూపంలో వసూలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయ్యాయని, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి కరువు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సారెస్పీ, నాగార్జునసాగర్ జలాలు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, చెరుకు యాకలక్ష్మి, బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి, వజ్జ శ్రీను, కల్లెపల్లి భాస్కర్, కడియం కుమార్, పల్లా సుదర్శన్, దేవరకొండ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎడమకాల్వకు నీటి విడుదల వాయిదా

నాగార్జునసాగర్, మార్చి 9: నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమకాల్వకు శనివారం నీటి విడుదల చేయాల్సి ఉండగా, అనివార్య కారణాలతో వాయిదా పడినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. సోమవారం తర్వాత నీటి విడుదల చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆదివారం కుడికాల్వకు నీటి విడుదల నిలిపివేసిన తర్వాత ఎడమకాల్వకు నీటి విడుదల చేయాలని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ) అధికారులు సూచించినట్లు సాగర్ ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

నవవధువును బలిగొన్న కులాంతర వివాహం

•7లో..

మఠంపల్లిలో మెడికల్ దుకాణ లైసెన్స్ రద్దు



మైనర్‌పై లైంగిక దాడి

పరారీలో నిందితుడు ● సూర్యాపేట జిల్లాలో ఘటన

నేరేడుచర్ల, మార్చి 9: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలో ఓ మైనర్‌పై లైంగికదాడి జరిగింది. ఎస్‌ఐ రవీందర్‌నాయక్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం నేరేడుచర్ల మండలానికి చెందిన 14ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన షేక్ సుభాని(45) అనే వ్యక్తి లైంగిక దాడి చేసి పరారయ్యాడు. బాధితురాలి తల్లి వరంగల్ జిల్లా చెందిన ఓ వ్యక్తితో 15 ఏళ్ల క్రితం వివాహం చేసుకుంది. రెండేళ్లకి కుమార్తె పుట్టింది. ఆ తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో విడాకులు తీసుకుంది. తర్వాత కుమార్తెను తీసుకొని బతుకుదెరువు కోసం కోదాడకు వచ్చింది. కోదాడలో నివాసముంటున్న ఆమెకు నేరేడుచర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ లారీడ్రైవర్ పరిచయమయ్యాడు. అతడిని వివాహం చేసుకుంది. ఏడాదిగా అద్దె ఇంట్లో కుమార్తె, భర్తతో కలిసి ఉంటోంది. వీరు ఉండే పక్క ఇంట్లోనే పెయింటింగ్ పని చేసే షేక్ సుభాని నివాసముంటున్నాడు. సుభాని కొంతకాలంగా భార్యతో విభేదించి దూరంగా ఉంటున్నాడు. నేరేడుచర్లలో మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. బాధితురాలు, షేక్ సుభాని ఇరువురు కుటుంబాలు ఒకే ఇంట్లో పక్కపక్క గదుల్లో అద్దెకు ఉంటున్నారు. షేక్ సుభానితో సహజీవనం చేస్తున్న మహిళతో శుక్రవారం రాత్రి ఘర్షణ జరగడంతో ఆమె శుక్రవారం రాత్రి సదరు బాలిక ఇంట్లో పడుకుంది. సుభాని మాత్రం అద్దె ఇంట్లోనే ఉన్నాడు. సుభానితో సహజీవనం చేస్తున్న మహిళకు ఇదే వీధిలో సొంత ఇల్లు ఉంది. ఉదయం బాలిక, తన తల్లితో కలిసి సుభాని సహజీవనం చేస్తున్న మహిళ ఇంటికి శనివారం ఉదయం వెళ్లారు. ఇంటికి వెళ్లి అన్నం పెట్టుకు రమ్మని తల్లి చెప్పడంతో బాలిక ఒంటరిగా వారు ఉంటున్న అద్దె ఇంటికి వచ్చింది. అది గమనించిన సుభాని ఆమె ఇంట్లోకి వెళ్లి బాలికపై బలవంతంగా లైంగిక దాడి చేసి గోడదూకి పారిపోయాడు. బాలిక ఈ విషయాన్ని తల్లికి చెప్పడంతో వారు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సంఘటనా ప్రాంతాన్ని హుజూర్‌నగర్ సీఐ చలమంద రాజు పరిశీలించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



తప్పిపోయిన బాలుడి అప్పగింత



భువనగిరిలో బాలుడిని తల్లి ఆసియాబేగానికి అప్పగిస్తున్న అధికారులు

భువనగిరి టౌన్ / భువనగిరి అర్బన్, మార్చి 9: ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడు ఎట్టకేలకు శనివారం అమ్మ చెంతకు చేరాడు. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం పడమటి సోమారం జాతరలో పోలీసులకు దొరికిన 11 ఏళ్ల మానసిక దివ్యాంగుడైన అబూబాకర్‌ను శనివారం అధికారులు తల్లికి అప్పగించడంలో కథ సుఖాంతమైంది. అధికారులు పేర్కొన్న వివరాల ప్రకారం.. హైదరాబాద్ బండ్లగూడలో నివాసం ఉంటున్న ఆసియాబేగం భర్తతో విడాకులు తీసుకుంది. ఆమె కుమారుడు అబూబాకర్ మానసిక దివ్యాంగుడు. అయితే ఈ నెల 5వ తేదీన అతడు ఇంటి నుంచి తప్పి పోయాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పరిసరాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించపోకపోవడంతో అదే రోజు బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఇంటి నుంచి తప్పిపోయిన బాకర్ బీబీనగర్ మండలం పడమటి సోమవారం జాతరలో ఒంటరిగా సంచరించడాన్ని గమనించిన పోలీసులు అదుపులోకి తీసుకొని జిల్లా బాలల పరిరక్షణ సమితికి అప్పగించారు. అయితే బాలుడి వివరాలు చైల్డ్‌హెల్ప్‌లైన్, సోషల్ మీడియాలో వెల్లడించడంతో మిస్సింగ్ కేసుగా దర్యాప్తు చేస్తున్న బండ్లగూడ పోలీసులు గమనించి ఆరా తీయడంతో అబూబాకర్‌గా నిర్ధారణ అయింది. ఈ మేరకు జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం భువనగిరిలో బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సి.సైదులు, చైల్డ్ హెల్ప్‌లైన్-1098 కోఆర్డినేటర్ దశరథ పాల్గొన్నారు.













కమనీయం.. శివపార్వతుల కల్యాణం

● భక్తుల జాగరణతో ఆలయాలు కిటకిట ● మేళ్లచెర్వులో ఆకట్టుకున్న కల్యాణోత్సవం, ప్రభల ప్రదర్శన ● కొనసాగుతున్న ఎద్దుల పందేలు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించారు. లింగోద్భవ వేళ స్వామి, అమ్మ వార్ల మహిమలను వివరిస్తూ అర్చకులు కల్యాణ తంతును జరిపించారు. ఉపవాసంతో పాటు జాగరణ చేసిన భక్తులు కల్యాణోత్సవాన్ని కన్నులారా తిలకించారు. ఉమ్మడి జిల్లాలో పెద్దజాతరల్లో ఒకటైన మేళ్ల చెర్వులో ప్రభల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అదేవిధంగా ఎద్దుల పందేలను తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు. సూర్యాపేట పరిధిలోని పిల్లలమర్రి దేవాలయంలో, నేరేడుచర్లలోని సోమప్ప ఆలయాల్లో కల్యాణోత్సవాలు నిర్వహించారు.



మేళ్లచెర్వు జాతర సందర్భంగా ప్రభలను ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, హాజరైన భక్తులు, విద్యుద్దీపాల ప్రభలు

మేళ్లచెర్వు, మార్చి 9 : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో మహాశివరాత్రి జాతర సందర్భంగా మండలకేంద్రం జనసంద్రమైంది. శుక్రవారం రాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవం, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభలను తిలకించడానికి, తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో గ్రామం, ఆలయ ప్రాంగణం మొత్తం జనసంద్రంగా మారింది.

కన్నులపండుగా కల్యాణం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్వయంభూ శంభులింగేశ్వరస్వామి వారికి, ఇష్టకామేశ్వరి అమ్మవారికి అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో కన్నులపండువగా కల్యాణ తంతు నిర్వహించారు. ప్రధాన ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను రాత్రి 2 గంటలకు స్వామి వారిని నంది వాహనంపై, అమ్మవారిని పల్లకిలో ఊరేగింపు తీసుకెళ్లారు. మొదటగా ఎదుర్కోళ్ల మహోత్సవం జరిగింది. అనంతరం కల్యాణ మండపానికి తీసుకెళ్లి, అశేష భక్త జనసమక్షంలో ముత్యాల తలంబ్రాలతో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున నంది వాహనంపై స్వామి, అమ్మవార్లను ఉదయం నాలుగ గంటలకు ప్రధాన ఆలయానికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ మహేంద్రకుమార్, ఈవో నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కుటుంబ సభ్యులు శనివారం స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్

జాతరకు పెద్దసంఖ్యలో భారీగా తరలిరావడంతో శుక్రవారం అర్ధరాత్రి ఆలయ ప్రాంగణంతో పాటు మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు గుడికి, గ్రామానికి మధ్యలోని ఎస్ఎస్పీ కాల్వల బ్రిడ్జిలపై భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. పోలీసుల అప్రమతతో ట్రాఫిక్‌ను నియంత్రించారు.

అట్టహాసంగా కబడ్డీ పోటీలు ప్రారంభం

జాతర సందర్భంగా అట్టహాసంగా నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను సీఐ రజితారెడ్డితో కలిసి పోశం నర్సిరెడ్డి శనివారం రాత్రి ప్రారంభించారు. మొదటి రోజు ఎనిమిది మంది మహిళ, పురుషుల జట్ల మధ్య పోటీలు నిర్వహించారు. మొదటగా సూర్యాపేట, రంగారెడ్డి మహిళా జట్లు తలబడ్డాయి. కార్యక్రమంలో ఎంపీపీ పద్మ, తహసీల్దార్ జ్యోతి, ఆలయ చైర్మన్ శంభిరెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన ఎద్దుల పందేలు రెండోరోజు శనివారం ఉదయం నుంచే కొనసాగుతున్నాయి.

పరమశివుడి ఆశీస్సులుండాలి: మంత్రి

ప్రతీ ఒక్కరికి పరమశివుడి ఆశీస్సులుండాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జాతర సందర్భంగా రూ.15 లక్షల వరకు వెచ్చించి వివిధ వర్గాల వారు విద్యుద్దీపాల ప్రభలను ఏర్పాటు చేశారు. ఏడు ప్రభలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1994 నుంచి జాతరకు క్రమంతప్పకుండా హాజరవుతున్నానని, ఆలయంలో మౌలిక సదుపాయల కల్పన కోసం రూ.కోటి నిధులు మంజూరు చేయించానన్నారు. ఇదిలా ఉండగా 100, 110అడుగుల ఎత్తు వరకు ఏర్పాటుచేసిన ప్రభలు ప్రజలను ఆకట్టుకున్నాయి.



కబడ్డీ పోటీల సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ రజితారెడ్డి

మట్టపల్లి క్షేత్రంలో

మఠంపల్లి : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో శనివారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తవత్సలుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. తర్వాత ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. కల్యాణోత్సవం అనంతరం ఉత్సవ మూర్తులకు పురవీధుల్లో గరుడవాహన సేవ నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్యాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఛాయాసోమేశ్వరాలయంలో

నల్లగొండ కల్చరల్ : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని పలు దేవాలయాల్లో శివపార్వతుల కల్యాణవేడుకలను వైభవంగా నిర్వహించారు. పానగల్లులోని శైవక్షేత్రాలైన ఛాయా, పచ్చల సోమేశ్వరాలయాలు, నల్లగొండలోని వీటీ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయం, తులసీనగర్ శ్రీభక్తాంజనేయస్వామి ఆలయం, షేర్‌బంగ్లా సంతోషిమాత ఆలయం, బీట్ మార్కెట్ శ్రీరామకోటిస్థూప దేవాలయంలో కన్నుల పండువగా కల్యాణాన్ని నిర్వహించారు. ఛాయా సోమేశ్వరాలయంలో శనివారం తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లను అగ్నిగుండాల్లో ఊరేగించారు. అనంతరం అభిషేకాలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన వింజమూరి లక్ష్మీ బృంద శాస్త్రీయ సంగీతాలాపన కార్యక్రమం జరిగింది. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనంలో ఆసీనులను చేసి కోనేరులో తెప్పోత్సవం, పవళింపు సేవ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములునాయక్, బండారు ప్రసాద్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, డీఎస్పీ శివరాంరెడ్డి, కౌన్సిలర్లు వేణుగోపాల్‌రెడ్డి, పర్వతరెడ్డి, అలుగుబెల్లి తిరుమల్‌రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.



ఛాయాసోమేశ్వరాలయంలో అగ్నిగుండాల్లో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు



మట్టపల్లి పురవీధుల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు

వేణుగోపాలస్వామి ఆలయంలో

నార్కట్‌పల్లి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని పలు ఆలయాల్లో శుక్రవారం అర్ధరాత్రి అభిషేకాలు, శివపార్వతుల కల్యాణాలను వైభవంగా నిర్వహించారు. నార్కట్‌పల్లి, గోపలాయపల్లి, ఏపీలింగోటం, అక్కెనపల్లి, అమ్మనబోలు గ్రామాల్లో కల్యాణోత్సవాలు నిర్వహించారు. నార్కట్‌పల్లిలోని బస్టాండ్ వెనుక ఉన్న పార్వతీ రామలింగేశ్వరస్వామి, మాంద్ర రహదారిలోని పురాతన సిద్ధ రామలింగేశ్వరాలయం, అక్కెనపల్లిలోని పురాతన బ్రహ్మసూత్రం గల శివాలయం, ఏపీలింగోటం, హరిహర క్షేత్రం గోపలాయపల్లిలలో శివపార్వతుల కల్యాణాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నార్కట్‌పల్లిలోని రామలింగేశ్వరాలయంలో ఎదుర్కోలు రథోత్సవం విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ పూజారులు నిడిగొండ భగవాన్ శర్మ, పుట్టపాక మురళీధర్‌రావులచే పూజాదికాలు జరుపబడ్డాయి. ఈ ఉత్సవాల్లో ఆలయ చైర్మన్‌లు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి రాజేశ్వరి, పుల్లెంల శ్రీనివాస్ మంగమ్మ దంపతులు భక్తులు పాల్గొన్నారు.

పిల్లలమర్రి ఆలయంలో

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట జిల్లాకేంద్ర పరిధిలోని పురాతన శైవాలయం పిల్లలమర్రి ఎర్రకేశ్వరాలయం ఎదుట శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున నామేశ్వర స్వామి దేవాలయం నుంచి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాల నడుమ, మహిళల కోలాటాల మధ్య కల్యాణమండపానికి ఉత్సవవిగ్రహాలను ఊరేగింపుతో తీసుకువచ్చారు. ఎదుర్కోళ్ల కార్యక్రమం అనంతరం శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని అర్చకులు హరిప్రసాద్‌శర్మ, మనగలేటి సంతోష్ శర్మ ఘనంగా నిర్వహించారు. జాగరణ కోసం పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. అదేవిధంగా ఎండ్లపల్లి గ్రామంలో స్వయంభూ శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో లింగాయత్ లింగ బలిజ పూజారుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లలమర్రి దేవాలయ కమిటీ చైర్మన్ కోట్ల సైదులుగౌడ్, డైరెక్టర్లు, యండ్లపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.



పిల్లలమర్రిలో కల్యాణోత్సవ ఘట్టం



దివ్యాలంకార శోభితుడు రామలింగేశ్వరుడిని సేవలో రథం వద్దకు తీసుకువస్తున్న అర్చకులు

వైభవంగా దివ్యవిమాన రథోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి9: యాదగిరికొండపై అనుబంధ ఆలయం పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరుడు కొలువుదీరిన శివాలయంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం లక్షబిల్వార్చనలు, రాత్రి వేళ దివ్యవిమాన రథోత్సవ ఘట్టాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. శివాలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడిని ఆరాధించిన అర్చకులు నిత్యహవనం, శివపంచాక్షరీ, మూలమంత్ర, మూర్తి మంత్ర జపాలు, వేద ఇతిహాస పారాయణ పఠనం చేశారు. అనంతరం ప్రధానాలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరస్వామిని కొలుస్తూ శివపార్వతుల సహస్రనామ పఠనాలతో గంట పాటు లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం నిత్య పూజాకైంకర్యాలు, వేద పారాయణ పఠనం, యాగశాలలో నిత్యలఘు పూర్ణాహుతి పర్వాలను నిర్వహించారు.

యాత్రాజనుల పూజల సందడి

యాదగిరీశుడి సన్నిధిలో శనివారం యాత్రాజనుల పూజల సందడి నెలకొంది. మహాశివరాత్రి పర్వదినం కావడంతో యాత్రాజనులు పెద్దసంఖ్యలో క్షేత్ర సందర్శనకు తరలివచ్చారు. యాత్రాజనుల సంచారంతో కొండకింద కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, బస్టాండ్లు, కొండపైన ఆలయ తిరువీధులు, ఉభయ దర్శన క్యూలైన్లు, ప్రధానాలయం, ప్రసాదాల విక్రయశాల ప్రాంతాలు సందడిగా కనిపించాయి. స్వామివారి ధర్మదర్శనాలకు రెండు గంటలు, ప్రత్యేక దర్శనాలకు అర గంట సమయం పట్టినట్టు, సుమారు 20వేల మందికి పైగా యాత్రికులు ఇష్టదైవాలను దర్శించుకున్నట్టు, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.28,00,487 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. స్వామికి నిత్యపూజా కైంకర్యాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ప్రాకార మండపంలో హోమం, నిత్యతిరుకల్యాణోత్సవాలను నిర్వహించారు.



నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కన్నుల పండువగా రథోత్సవం

యాదగిరికొండపైన శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి రామలింగేశ్వరస్వామి దివ్య విమానరథంపై భక్తులకు దర్శనమిచ్చి తరింపజేశాడు. ఆలయ బాహ్యప్రాకారంలో స్వామివారి దివ్యవిమానరథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. పట్టువస్త్రాలు, బంగారు, వెండి, ముత్యాల ఆభరణాలతో పర్వవర్థినీ అమ్మవారిని, రామలింగేశ్వరుడిని దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక సేవలో తీర్చిదిద్దారు. ప్రధానాలయంలో ఊరేగించి బాహ్యప్రాకారంలోని దివ్యవిమాన రథం వద్ద ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దిన పురోహితులు, అర్చకబృందం రథాంగబలి, దిష్టికుంభ పూజలను నిర్వహించారు. అనంతరం దివ్యవిమాన రథంపై కల్యాణమూర్తులను అధిష్ఠింపజేశారు. అనంతరం దివ్యవిమాన రథాన్ని శివాలయ ప్రాకార మండపంలో భక్తుల జయజయ ధ్వానాల నడుమ ఊరేగింపు వేడుకలు నేత్రపర్వంగా కొనసాగాయి. ఈ విశేష పర్వాల్లో ఆలయ అనువంశీక ధర్మకర్త బి. నరసింహమూర్తి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మహోత్సవాల్లో రథోత్సవ విశిష్టత

నూతన కల్యాణపరులైన శివపార్వతులను శివరాత్రి మహోత్సవాల్లో దివ్యవిమాన రథంలో అధిష్ఠింపజేసి ఊరేగింపు నిర్వహించడం సంప్రదాయం. అర్ధనారీశ్వర రూపంలో పార్వతీ, పరమేశ్వరులను ఏకరూపంలో దర్శనం కలిగించే ఈ రథోత్సవ ఘట్టం శివరాత్రి మహోత్సవాల్లో మహోత్తరమైందని, అద్వైత జ్ఞానప్రకాశమని శివ పురాణం దేవస్థాన ప్రధాన పురోహితులు గౌరిభట్ల సత్యనారాయణ శర్మ వివరించారు. రథమనే దేహ భ్రాంతిని విడనాడి జ్ఞాన స్వరూపుడైన శివుడిని ఆశ్రయిస్తే కైవల్యం ప్రాప్తిస్తుందని వేదాలు తెలుపుతున్నాయని ఆయన అన్నారు.

నేరేడుచర్ల సోమప్ప ఆలయంలో

నేరేడుచర్ల: మహాశివరాత్రి సందర్భంగా సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని సోమప్ప దేవాలయం, నేరేడుచర్ల, దిర్శించర్ల శివాలయాల్లో శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రాచీన సోమప్ప దేవాలయంలో పూజారి శ్రీనివాసశాస్త్రి, వేద పండితులు సాగి నర్సింహమూర్తి, దుర్గాప్రసాద్ శర్మ, ఇరువంటి శ్రీపాదశర్మ ఆధ్వర్యంలో రంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మూడు రోజులు సెలవు దినాలు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. శుక్రవారం రాత్రి వినోద కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణ దగ్గరుండి పర్యవేక్షించారు. నేరేడుచర్ల శివాలయంలో కల్యాణానికి భారీగా తరలివచ్చారు. ఆలయ పూజారి ఉగ్రదండి శివప్రసాదశర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. రాచకొండ కోటేశ్వరావు, కొణతం సీతారాంరెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు దాతలు, వ్యాపార వేత్తలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



సోమప్ప ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు, హాజరైన భక్తులు

నవవధువును బలిగొన్న కులాంతర వివాహం

భువనగిరి రూరల్, మార్చి 9: ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్న 19 రోజులకే అత్తగారి వేధింపులు తాళలేక నవవధువు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్సపొందుతూ శనివారం మృతి చెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం చీమలకొండూరులో చోటుచేసుకుంది. ఎస్ఐ వీ.సంతోష్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... చీమలకొండూరు గ్రామానికి చెందిన బీట్కూరి మనోహర్, అదే గ్రామానికి చెందిన పల్లెర్ల భూమిక(19) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వేర్వేరు కులాలు కావడంతో మనోహర్ కుటుంబసభ్యులు వీరి వివాహానికి అంగీకరించలేదు. అయితే ఫిబ్రవరి 17న యాదగిరిగుట్టలో మనోహర్, భూమిక కులాంతర వివాహం చేసుకున్నారు. కాగా, వివాహం అనంతరం వారిద్దరూ చీమలకొండూరులోని మనోహర్ ఇంటికి వచ్చారు. కులం తక్కువదానివి అంటూ అత్త స్వరూప సూటిపోటి మాటలతో వేధిస్తుండటంతో విషయం తెలుసుకున్న గ్రామపెద్దలు పంచాయితీ పెట్టి ఇరు కుటుంబాలను సముదాయించారు. అయితే అత్తతో పాటు భర్త కూడా వేధిస్తున్నాడని భూమిక మనోవేదనకు గురైంది. ఈ నెల 2వ తేదీన అదే గ్రామంలో ఉంటున్న తల్లిగారింటికి వెళ్లింది. అత్తింటి వ్యవహారశైలిపై తీవ్ర మనస్తాపంతో ఉన్న భూమిక ఈ నెల 6వ తేదీన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. బంగ్లాపై దుస్తులు ఆరవేస్తున్న తల్లి రేణుక అనుమానంతో కిందికి వచ్చి కిటికీలోంచి గదిలో చూడగా భూమిక తాడుకు వేలాడుతూ కనిపించింది. వెంటనే చుట్టుపక్కల వారిని కేకలు వేస్తూ పిలిచి తలుపులను పగులగొట్టి లోపలికి వెళ్లేలోగా భూమిక అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను హుటాహుటిన భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మూడు రోజులు అక్కడ చికిత్స పొందుతూ భూమిక శనివారం మృతి చెందింది.



భూమిక(ఫైల్‌ఫొటో)



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న భూమిక బంధువులు

భూమిక మృతదేహంతో ఆందోళన

అత్తింటి వేధింపులతోనే భూమిక ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొంటూ ఆమె కుటుంబసభ్యులు, బంధువులు ఆమె మృతదేహంతో మనోహర్ ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు.ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. విషయం తెలుసుకున్న రాచకొండ కమిషనరేట్ భువనగిరి జోన్ ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, ఎస్ఐ సంతోష్‌కుమార్ బందోబస్తుతో గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భూమిక కుటుంబసభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరికి తరలించారు. రెండు గంటల పాటు ఆందోళన జరిగింది. భూమిక తల్లి రేణుక ఫిర్యాదు మేరకు ఆమె భర్త మనోహర్, అత్త స్వరూపపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

మఠంపల్లిలో మెడికల్ దుకాణ లైసెన్స్ రద్దు

మఠంపల్లి, మార్చి 9 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో మత్తు మందులు విక్రయించిన దుర్గాభవానీ మెడికల్ షాప్ లైసెన్స్ రద్దు చేస్తూ యజమాని రమావత్ రవీందర్ నాయక్‌కు నోటీసులు జారీ చేసినట్లు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ వెంకటరావు, ఎక్సైజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారుల సహకారంతో జిల్లా వ్యాప్తంగా దాడులు, తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. దాడుల్లో దుర్గాభవానీ మెడికల్ యాజమాని పట్టుబడ్డాడని, కోదాడ, హుజూర్‌నగర్, మఠంపల్లి ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు మత్తు మందుల వ్యాపారం కోసం ఓ ముఠాగా పనిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ముఠా వెనుక ఎవరెవరు ఉన్నారనే కోణంలో విచారణ చేస్తున్నామని, ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు ఉన్నా వదిలేది లేదన్నారు. వారం రోజుల్లో మరెన్నీ దాడులు, విచారణ కొనసాగించి అందరి వివరాలు వెల్లడిస్తామన్నారు.

తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన గమనించాలి

మత్తుమందుకు బానిసలై యువకులు, విద్యార్థులు తమ భవిష్యత్‌ను కోల్పోతున్నారని, తల్లిదండ్రులు ప్రతి రోజూ పిల్లల ప్రవర్తనను గమనించాలని తహసీల్దార్ మంగా రాథోడ్, కోదాడ ఎక్సైజ్ ఎస్ఐ గోవర్ధన్‌లు సూచించారు. మత్తు మందులకు అలవాటు పడితే విద్యార్థులు సైకోలా మారుతారని తెలిపారు. అంతదూరం రాకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. పిల్లల్లో మార్పులు కనబడితే కౌన్సెలింగ్ ఇవ్వాలని, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్తే ఆ తర్వాత కారణాలను తెలుసుకొని వారి భవిష్యత్‌ను కాపాడే వీలుంటుందని సూచించారు.

వీఆర్‌ఏ ఆత్మహత్య

డిండి, మార్చి 9 : నల్లగొండ జిల్లా డిండి మండలంలో వీఆర్‌ఏ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోనబోయినపల్లి గ్రామానికి చెందిన రాగడపల్లి కృష్ణయ్య(70) గ్రామంలో వీఆర్‌ఏగా పనిచేస్తున్నాడు. కృష్ణయ్య ఉద్యోగం చేస్తున్నందున తమకు రూ.12లక్షలు ఇవ్వాలని పాలివారు డిమాండ్ చేశారు. రూ.12లక్షలు తెచ్చి ఇవ్వలేని కృష్ణయ్య మనస్థాపంతో ఈనెల 8న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. కృష్ణయ్య మృతికి కారణమైన రాగడపల్లి విజయ్, రాగడపల్లి ధనంజయతోపాటు మరో ఎనిమిది మందిపైనా కృష్ణయ్య కుమారుడు పెద్దయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కృష్ణయ్యకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉండగా వారికి వివాహాలు అయ్యాయి.

కేంద్ర ప్రభుత్వం ప్రజల పక్షం


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కోదాడటౌన్, మార్చి 9: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల పక్షమని మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు నూనె సులోచన అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్యాస్ సిలిండర్‌పై రూ.100 తగ్గించడాన్ని హర్షిస్తూ కోదాడలో శనివారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉజ్వల లబ్ధిదారులకు రూ.300, సాధారణ లబ్ధిదారులకు రూ.100 తగ్గించడం హర్షణీయమన్నారు. గ్యాస్ తగ్గించడం పట్ల మహిళలు సంబరాలు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ, వంగవీటి శ్రీనివాసరావు, వెలుగుల చిట్టిబాబు, శ్రీనివాస్, రాధాకృష్ణ, పురుషోత్తం, రేణుక, ఈశ్వర్‌రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భానుపురి, మార్చి 9: సూర్యాపేట జిల్లాకేంద్రంలోని 33/11కేవీ ఇండస్ట్రియల్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సాయంత్రం 4గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సూర్యాపేట టౌన్-1 ఏఈ సురేష్ శనివారం ప్రకటనలో ఆదివారం తెలిపారు. శాంతినగర్, ఇండస్ట్రీయల్ ఏరియా, విజయకాలనీ, గిరినగర్, హనుమాన్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు


కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మఠంపల్లి, మార్చి 9: మండలంలోని పెదవీడు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్, గ్రామ శాఖ అధ్యక్షుడు సయ్యద్ కరీం ఆధ్వర్యంలో శనివారం నీటిపారుదల, పౌర సరఫరా శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమక్షంలో వారు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

ఆ కమిటీకి టీఎమ్మార్పీఎస్‌తో సంబంధంలేదు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములుమాదిగ

సూర్యాపేటటౌన్, మార్చి 9: ఇటీవల జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యానని చెబుతున్న కమిటీకి టీఎమ్మార్పీఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములు మాదిగ అన్నారు. జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన కత్తి ఉపేందర్ నియామకం చెల్లదన్నారు. స్వలాభం కోసం కులాన్ని అడ్డుపెట్టుకుంటున్నాడని ఆరోపించారు. కుల సంఘాలు వేరు రాజకీయపార్టీలు వేరని, రాజకీయాల కోసం కుల సంఘాలను వాడుకోవద్దని సూచించారు. అనంతరం పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్య దర్శిగా పంతం సతీష్, పట్టణ యూత్ అధ్యక్షుడిగా వల్లాస్ అవినాష్‌కు నియా మకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నకిరేకంటి సైదులు, బోడ్డు సైదమ్మ, మీసాల శివరాంకృష్ణ, పిడమర్తి మధు, బొల్లె అశోక్, సూరారపు నాగయ్య, యడవెల్లి రాము, కొండేటి సందీప్, మీసాల గోపి, గౌతమ్, శ్రీను, మహేందర్, మహేష్, సోమేష్, అఖిల్ పాల్గొన్నారు.

సైన్స్ అభివృద్ధికి కృషిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బారావు

కోదాడ, మార్చి 9: సైన్స్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని డాక్టర్ జాస్తి సుబ్బారావు అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో శనివారం నిర్వహించిన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ముండ్ర ఆదినారాయణ సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఆదినారాయణ జన విజ్ఞాన వేదికలో పనిచేస్తూ, సమాజంలో మార్పు తెచ్చేందుకు కృషిచేశారన్నారు. కార్యక్రమంలో రావెళ్ల సీతారామయ్య, రమేష్‌బాబు, అంజనేయులు, జాఫర్, టీఎల్ స్వామి, దుర్గా ప్రసాద్, రామనర్సయ్య, సైదులు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు 'తేజ' విద్యార్థులు



కోదాడ రూరల్, మార్చి 9: మండలంలోని కొమరబండ తేజ విద్యాలయ విద్యార్థులు ఫిట్ ఇండియా రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమా సోమిరెడ్డి తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ, భారత క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 2021 సంవత్సరం నుంచి ఫిట్ ఇండియా పేరున క్విజ్ నిర్వహిస్తుందన్నారు. పాఠశాల స్థాయిలో ఆటలు, వ్యాయామం, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఫిట్ ఇండియా క్రీడా క్విజ్‌ను నిర్వహిస్తుందని తెలిపారు. అందు లో భాగంగా ఈ ఏడాది ఫిట్ ఇండియా క్విజ్-2023 దేశవ్యాప్తంగా డిసెంబరు 2023లో ప్రిలిమినరీ స్థాయి క్విజ్ నిర్వహించారని, ఫలితాలను శనివారం ప్రకటించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎనిమిది పాఠశాలల జట్లు రాష్ట్రస్థాయి సెమీఫైనల్స్‌కు ఎంపికయ్యాయన్నారు. ఇందులో తేజ విద్యాలయానికి చెందిన పదో తరగతి విద్యార్థి పల్లా హృతిక్‌కు 2వ ర్యాంక్, 9వ తరగతి విద్యార్థి నవీన్‌కుమార్‌కు 4వ ర్యాంక్ లభించిందన్నారు. వీరు ఏప్రిల్‌లో రాష్ట్రస్థాయి, దేశీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

పెన్‌పహాడ్, మార్చి 9: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని నాగులపహాడ్ త్రికుటేశ్వరాలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో గుంటకండ్ల సావిత్రమ్మ జ్ఞాకార్థం దాత, మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సునీత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగందర్, దేవాలయ చైర్మన్ సంకరమద్ది సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సహకారంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి కబడ్డీ, కోలాటం, వాలీబాల్ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానికిరాంరెడ్డి, సంకరమద్ది దామోదర్‌రెడ్డి, చైర్మన్ సంకరమద్ది సుధీర్‌రెడ్డి, మాజీ చైర్మన్ సంకరమద్ది నిరంజన్‌రెడ్డి, ఏపూరి నగేష్, దేవయ్య, ఏదుళ్ల రాంరెడ్డి, నారాయణ ప్రవీణ్‌రెడ్డి హైమవతి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చిలుకూరు: మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. నారాయణపురంలో ఊర వెంకటనారాయణ, లక్ష్మీనారాయణ, నర్సింహారావుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జానకినగర్‌లో కాళికామాత ఆలయం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానీమియా, నారాయణపురం మాజీ సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ చిన్నా, బట్టు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: మండలంలోని సోమప్ప దేవాలయానికి మిర్యాలగూడ మండలం ఊట్లపల్లి గ్రామానికి చెందిన గజ్జి వెంకన్న వెలమంచమ్మ దంపతులు కోడెదూడను ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణకు అందజేశారు. ఆలయానికి దాతలు ఇచ్చే విరాళాలు, బహుమతులను సద్వినియోగం చేసుకొని ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లొడంగి సైదులు, పెండెం సైదులు, పగిడిమర్రి సోమయ్య, పూజారి ఇరువంటి శ్రీనివాసశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.


కోదాడ : తొగర్రాయిలో కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

మఠంపల్లి: శివరాత్రి పర్వదినం భక్తుల కోలాహలం మధ్య శివ నామస్మరణతో ఆలయాలన్నీ శివోహంతో మారుమోగాయి. పంచామృతాలతో అభిషేకాలు, రంగురంగుల పూలతో అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పురాతన దేవాయాలు ఉన్న గ్రామాలు యాతవాకిళ్ల, పెదవీడు, మఠంపల్లి, చౌటపల్లి దేవాలయాల్లో శివరాత్రి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. అనంతరం అన్నదానం చేశారు.

కోదాడ రూరల్: మండలంలోని తొగర్రాయి గ్రామంలో వెంచేసి ఉన్న ప్రాచీన భ్రమరాంబ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి పార్వతీ పరమేశ్వర కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారిని పల్లకిలో, స్వామివారిని నంది వాహనంపై వేంచింప జేసి దివిటీ ఉత్సవం, ఎదుర్కోళ్ళు కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణ మండపంలోకి చేరుకున్న స్వామివార్లకు వేదపండితుల మంత్రోచ్ఛరణతో గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, కాన్యదానం, ప్రవర, జీలకర్ర బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు వంటి వైదిక క్రతువులను జరిపారు. దేవాలయ అర్చకులు రెంటాల పుల్లేశ్వరశర్మ, ముదుంబా విష్ణువర్ధనాచార్యులు, వేద పండితులు కొంకపాక పురుషోత్తమశర్మ, మహంకాళి రాకేశ్ శర్మ, ప్రవరాఖ్యశర్మ, మహేష్‌శర్మలు వేద మంత్రాలతో నిర్వహించారు. స్వామివార్లకు యాదా శ్రీనివాసరావు మీనా, ఉపేందర్ సంగీత దంపతులు నూతన పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. కార్యక్రమంలో ముదుంబా లక్ష్మాచార్యులు, వేణుగోపాలస్వామి దేవాలయ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ దొంగల లక్ష్మీనారాయణ, నందుల శాస్త్రి, యాదా హనుమంతరావు, సురేష్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు ఉన్నారు.


హుజూర్‌నగర్: బూరుగడ్డలో కల్యాణం, ప్రత్యేక అలంకరణలో శివలింగం

నడిగూడెం: శివరాత్రి ఉత్సవాలు మండలంలోని వల్లాపురం బాల కోటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కొనసాగాయి. శుక్రవారం రాత్రి పార్వతీ సమేత బాలకోటేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణానికి సూర్యాపేట, ఖమ్మం జిల్లాల పరిధిలోని భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. పూజారులు ఇంగువ సంగమేశ్వర ప్రసాద్, బాల సుబ్రమణ్యశర్మ స్వామివారి కల్యాణం నిర్వహించారు.


మఠంపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


పెన్‌పహాడ్ : నాగులపహాడ్‌లో అన్నదానం చేస్తున్న ఎంపీపీ భిక్షం


చిలుకూరు: పాలెఅన్నారంలో అన్నదానం చేస్తున్న దాతలు

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ మల్లెల రాణి

కోదాడ రూరల్, మార్చి 9: ప్రభుత్వ అభివృద్ధి పనుల నిర్వహణలో యువతకు భాగస్వామ్యం కల్పిస్తామని ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య అన్నారు. మండలంలోని కాపుగల్లు గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల నిర్వహణలో యువతకు అవకాశం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మండలంలో అన్ని గ్రామాలకు సీసీరోడ్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ప్రత్యేక పైప్‌లైన్లతో పాటు బోర్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తొండపు సతీష్, సింగిల్ విండో చైర్మన్ నంబూరి సూర్యం, కాంగ్రెస్ నాయకులు రేపూరి వెంకటాచారి, ఉన్నం హనుమంతరావు, ముత్తవరపు వీరయ్య, కాసాని రామారావు, నర్సింహారావు, వీరబాబు, వేణు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చదువుకుంటే సమాజాన్ని మార్చవచ్చు



సమావేశంలో మాట్లాడుతున్న పూలన్

ఆత్మకూర్(ఎస్), మార్చి 9: మహిళలు చదువుకుంటే సమాజాన్ని మార్చవచ్చని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు పూలన్ అన్నారు. మండల పరిధిలోని పాత సూర్యాపేటలో ప్రగతిశీల మహిళ సంఘం(పీవోడబ్ల్యూ) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ శ్రామిక మహిళ పోరాట దినోత్సవంలో ఆమె మాట్లాడారు. సమాజంలో మహిళలు చదువుకుంటే వారి కుటుంబతో పాటుగా వ్యవస్థను మార్చగల శక్తి సామర్థ్యాలు ఉంటాయన్నారు. మహిళలపై జరుగుతున్న శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా మెరుగైన పరిస్థితుల కోసం పోరాటం చేయాలన్నారు. పురుషులతో సమానంగా అన్ని యూనియన్లలో తమకు కూడా భాగస్వామ్యం కల్పించాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, హింస, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సమ్మ, టీపీటీఎఫ్ జిల్లా నాయకులు శుభాన్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, సామ నర్సిరెడ్డి, రేణుక, శైలజ, మమత, పున్నమ్మ, లక్ష్మమ్మ, పద్మ, హైమవతి, లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయాలు సాధించాలి



రాయల సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్, మార్చి 9 : ప్రతిఘటన పోరాట యోధుడు సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయాలు సాధించాలని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న అన్నారు. జిల్లాకేంద్రంలోని కుడకుడ లెనిన్‌నగర్‌లో శనివారం నిర్వహించిన రాయల సుభాష్ చంద్రబోస్ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన జీవిత కాలంలో పేదప్రజల పక్షాన పోరాడిన చిరస్మరణీయుడు రాయల సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో విప్లవోద్యమాన్ని నిర్మించడంలో రాయల సుభాష్ చంద్రబోస్ కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రఅఖిల్‌కుమార్, చంద్రకళ, వాజిద్, వీరబోయిన రమేష్, సయ్యద్, జయమ్మ, గులాం హుస్సైన్, సైదులు, రమేష్, రవి, రాజు, ఉపేందర్, లక్ష్మీ, పద్మ, రమణ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో..

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ వర్థంతి సందర్భంగ జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నాయకులు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శిగంట నాగయ్య, కునుకుంట్ల సైదులు, సామా నర్సిరెడ్డి, బండి రవి, అశోక్‌రెడ్డి, పిడమర్తి భరత్, బోడ్డు ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి రోజు వెలుగులోకి శివలింగం


బ్రహ్మసూత్రం కలిగిన శివలింగం

గరిడేపల్లి, మార్చి 9: గరిడేపల్లి మండలం సర్వారం గ్రామశివారులో నల్లగుట్టపైన శివరాత్రి రోజు శివలింగం వెలుగుచూసింది. ఈ శివలింగాన్ని చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. ఇక్కడ వెలసిన శివలింగానికి ప్రత్యేకత ఉందని, ఇది బ్రహ్మసూత్రంతో కూడినదని గరిడేపల్లి మండలం కీతవారిగూడెం శివాలయ పూజారి రాయప్రోలు శ్రీరామయ్య శర్మ తెలిపారు. ఈ బ్రహ్మసూత్రం కలిగిన శివలింగాన్ని దర్శించుకుంటే అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని, రోగాల నుంచి ఉపశమనం కలుగుతుందని చెప్పారు. ఇక్కడ శివలింగం వెలిసిన విషయం తెలుసుకున్న మండలంలోని లక్ష్మీపురం, సర్వారం గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామశివారులో గల గుట్ట మీద వెలిశానని శివుడు కలలోకి వచ్చి చెప్పడంతో శివలింగాన్ని వెతికి తీశామని సర్వారం గ్రామానికి చెందిన పగిడి గోపి చెప్పాడు.

మాదిగలకు సముచిత స్థానం కల్పించాలి


ఉపేందర్‌ను అభినందిస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్, మార్చి 9: రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కత్తి ఉపేందర్‌మాదిగ కోరారు. జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగల న్యాయమైన డిమాండ్ అయిన ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ఎన్నికల ముందు బీజేపీ చెప్పిందని వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లును చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. మాదిగల సమస్యలపై టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు ఇటుక రాజుమాదిగ అనేక ఉద్యమాలు చేశారని తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఉపేందర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, కొండగడుపుల సూరయ్య, వల్లాస్ శంకర్, రమేష్, కమల్, నీలమ్మ పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపు, ఓటమి సహజం


ఎంపీకి స్వాగతం పలుకుతున్న నాయకులు

కోదాడ రూరల్, మార్చి 9: ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, కార్యకర్తలు నిరాశ చెందవద్దని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. మండలంలోని ఎర్రవరంలో శ్రీబాల ఉగ్ర నరసింహ స్వామివారిని శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణపవరంలో బీఆర్‌ఎస్, మున్నూరు కాపు సంఘం నాయకులు ఆయనను సన్మానించారు. నాడు కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో సస్యశ్యామలంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగిందన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో ప్రజలను ఎలా మోసం చేస్తుందో ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గణపవరం మాజీ సర్పంచ్ జాబిశెట్టి చంద్రమౌళి, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, పోశం పూర్ణయ్య పోశం ఏడుకొండలు, కత్తి వెంకటేశ్వరరావు, బొర్ర చంద్రమౌళి, పుప్పాల రంజిత్, ఇప్పాల చంద్రశేఖర్, పాశం నరేష్, శంకరశెట్టి గోపాల్‌రావు ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటనపై హర్షం

తిరుమలగిరి, మార్చి 9: ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం పీఆర్సీ ప్రకటన పట్ల టీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం తిరుమలగిరిలో యూనియన్ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడాడు. పెండింగ్‌లో ఉన్న 50శాతం ఆర్‌పీఎస్ బాండ్ల డబ్బులు చెల్లిస్తామని ప్రకటించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో చల్లా యాకుబ్‌రెడ్డి, కృష్ణ, సురాంబ, సోమేష్, ఎల్లయ్య, పద్మ, నాగమణి పాల్గొన్నారు.

'చెవిటి వెంకన్నకు ఎంపీ టికెట్ ఇవ్వాలి'

నాగారం, మార్చి 9: భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ టికెట్ చెవిటి వెంకన్నయాదవ్‌కు ఇవ్వాలని నాగారం యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కే. వలీ కోరారు. నాగారం మండలకేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ బలహీన వర్గానికి చెందిన చెవిటి వెంకన్నకు కాంగ్రెస్ అధిష్ఠానం టికెట్ కేటాయించాలని ఆయన కోరారు. వెంకన్న కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అక్బర్, సైదులు, హుస్సైన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించాలి

సూర్యాపేటఅర్బన్, మార్చి 9: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించాలని స్లేట్ ఫై స్కూల్ కరస్పాండెంట్ రజినీకాంత్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో మాట్లాడారు. ప్రస్తుతం చిన్నారులు మొబైల్‌ఫోన్, టీవీలకు అంకితమవుతున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమపిల్లలతో కాసేపు గడపాలని సూచించారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత ఇలాంటి కార్యక్రమాలతో ద్వారా వెలుగులోకి వస్తాయని తెలిపారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు పలువురిని అలరించాయి.

ప్రతి కుటుంబం ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి

అర్వపల్లి, మార్చి 9: ప్రతి కుటుంబానికీ ఇన్సూరెన్స్ ఆర్థిక భద్రత కల్పిస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని అడివెంల గ్రామానికి చెందిన మంద రవి రెండేళ్ల క్రితం శ్రీరామ్స్ ఇన్సూరెన్స్ కంపెనీలో రూ.21వేల 80పాలసీ తీసుకొని మృతి చెందాడు. మృతుడి భార్య శైలజకు రూ.7లక్షల 14వేల చెక్కును ఎమ్మెల్యే శనివారం అందజేశారు. అదే విధంగా శైలజకు 13ఏళ్లపాటు రూ.3వేల చొప్పున పెన్షన్ వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏజీఎం సురేష్, డీఎం చిరంజీవి, బీఎం భరత్‌కుమార్, ఉద్యోగులు నరేష్‌గౌడ్, ఉప్పలయ్య, కృష్ణారావు, నాగేశ్వర్‌రావు, మంజుల, రాజుయాదవ్, మధుసూదన్, సుధాకర్, సురేందర్, కృష్ణ, రఘు, జానుగౌడ్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన రవన్న

కోదాడటౌన్, మార్చి 9: పీడిత ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు రాయల సుభాష్‌చంద్రబోస్ రవన్న) అని అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి అన్నారు. శనివారం లాల్ బంగ్లాలో రవన్న 8వ వర్ధంతిని, సీపీఐఎంఎల్ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల సమస్యల సాధనకు పోరాడిన నాయకుడు రవన్న అన్నారు. ఆయన ఆశయ సాధనకు యువత కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వి. నర్సింహారావు, సత్యనారాయణ, అనంతరామయ్య, ప్రతాప్, కల్యాణి, మైసయ్య, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

జానల్‌దిన్నెలో సీసీ కెమెరాలు ఏర్పాటు

నేరేడుచర్ల, మార్చి 9: నేరేడుచర్ల మండలం జానల్‌దిన్న గ్రామంలో గ్రామస్థులు సొంత ఖర్చులతో గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కుసుమ సోమిరెడ్డి, చాడ కృష్ణారెడ్డి, రాపోలు లక్ష్మీనారాయణ, పోలె వెంకటేశ్వర్లు, సుందరయ్య పాల్గొన్నారు.

మహిళలకు బహుమతులు అందజేత

ఆత్మకూర్(ఎస్), మార్చి 9: అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా శనివారం ఆత్మకూర్(ఎస్) జడ్పీ హైస్కూల్ లో ఎంవీఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కబడ్డీ, చైర్స్‌ఆట, తాడుఆట, పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు ఎంవీఎఫ్ ఫౌండేషన్ సభ్యులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల ఇన్‌చార్జి వత్సవాయి లలిత, కార్యదర్శి సుధాకర్, ఐసీడీఎస్ పద్మ, వీబీకే అనిత, నాగలక్ష్మీ, సునంద, మంజుల, అన్నపూర్ణ, శిరీష, గాయత్రి, నిర్మల, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

పాలకవీడు, మార్చి 9: విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధమైంది. ఈ సంఘటన పాలకవీడు మండలంలోని మీగడంపాడుతండాలో శుక్రవారం రాత్రి జరిగింది. మండలంలోని మీగడంపాడు తండాకు చెందిన భూక్యా బాబు కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం సాయంత్రం మేళ్లచెర్వు జాతరకు వెళ్లారు. రాత్రి 11 గంటల సమయంలో పూరిగుడిసెలో నుంచి ఒకేసారి మంటలు ఎగసిపడటంతో చుట్టు పక్కలవాళ్ల మంటలను చూసి ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఇంట్లో ఉన్న బీర్వా, టీవీ, ఇతర సామగ్రి కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఎంపీపీ గోపాల్ సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలోని పలువురి సహకారంతో మరో రూ.50వేలు సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు.

జూదరుల అరెస్టు

మేళ్లచెర్వు, మార్చి 9: మహాశివరాత్రి జాతరలో గుండు ఆట నిర్వహిస్తున్న ఐదుగురు జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా శుక్రవారం రాత్రి భారీగా జూదం నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి.